

పర్యావరణ విద్యాకేంద్రం శిథిలం

మహానంది, జూలై 10:

అటవీశాఖ పర్యావరణ విద్యాకేంద్రం అనే పేరుతో 23 సంవత్సరాల క్రితం మహానందిలో ఓ భవనాన్ని నిర్మించింది. దీని కోసం దాదాపు రూ. 20 లక్షల నిధులను ఖర్చు చేసింది. కాలక్రమేణ ఈ భవనం శిథిలాస్థకు చేరుకుంది. నిధుల కొరతతో పర్యవేక్షణ కరువైంది. కాపలా సిబ్బందిని నియమించక పోవడంతో రక్షణ కూడా కరువైంది. ఇప్పుడు ఈ భవనం శిథిలమైపోయింది. ఇది నిరుపయోగమైంది.



శిథిలావస్థకు చేరిన కుందేళ్ల కుటీరాలు, చీలకలు ఇచ్చిన అరుగులు

● నిర్లక్ష్యం, నిధుల కొరత ● కాపలా సిబ్బంది కూడా కరువు ● నిరర్థకంగా రూ. లక్షలు వెచ్చించిన భవనం

మహానంది క్షేత్రానికి ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని క్షేత్రానికి సమీపంలోని నందిపార్క్ పక్కన ఉన్న అటవీ స్థలంలో 1999లో అప్పటి అటవీశాఖ కన్సర్వేటర్ డి.కె పాండే చొరవతో 10 ఎకరాల స్థలంలో రూ. 20 లక్షలతో అటవీ పర్యావరణ విద్యాకేంద్రం భవనాన్ని నిర్మించారు. ఇందులో నల్లమల అందాలను, వన్య ప్రాణుల చిత్రాలతో హైదరాబాద్‌కు చెందిన శ్రీను అనే చిత్రకారుడితో అద్భుతంగా గీయించి ఏర్పాటు చేసారు. అలాగే ఉన్నత స్థాయి అధికారులు సమావేశం నిర్వహించుకొనేందు కోసం ప్రత్యేక సమావేశ గదిని నిర్మించారు. వీటితో పాటు నల్లమల గురించి పర్యాటకులు తెలుసుకోడానికి వీలుగా విశాలమైన గ్రంథాలయం నెలకొల్పారు. ఇందులోనే అటవీ సిబ్బందికి లభించిన వివిధ రకాల వన్యప్రాణుల అవయవాలను పర్యాటకులు తిలకించేందుకు ఏర్పాటు చేసారు. విద్యాకేంద్రం పరిసరాల్లో నక్షత్ర వనం, రామచిలుకలు, కుందేళ్లు ఉండేందుకు ప్రత్యేకంగా వెదురుతో గ్రీనరీ బోనులను ఏర్పాటు చేసారు. భవనం ముందు భాగంలో ఫౌంటెన్‌ను నిర్మించారు. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అందులోని గార్డెన్‌తో పాటు ఫౌంటెన్ కోసం ఏర్పాటు చేసిన ప్రదేశం అంతా చెత్తా చెదారంతో నిండిపోయింది. రక్షణ గోడ లేకపోవడంతో అటువైపుగా చిన్నారులు వెళ్ళితే ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. భవనం పక్కనే ఏపుగా పెరిగిన నీలగిరి వృక్షం కూలిపోయేలా ఉంది. అదే జరిగితే పర్యావరణ విద్యాకేంద్రం భవనం పూర్తిగా దెబ్బతినిపోతుంది. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి నీలగిరి వృక్షాన్ని జాగ్రత్తగా తొలగించాల్సి ఉంది.

అలంకారప్రాయంగా విశ్రాంతి భవనం:

పర్యావరణ విద్యాకేంద్రం పరిసరాల్లో రూ. లక్షలతో నిర్మించిన అటవీ అధికారుల విశ్రాంతి భవనం అలంకార ప్రాయంగా మిగిలింది. అత్యాధునిక వసతులతో నిర్మించిన ఈ భవనాన్ని పర్యవేక్షించేందుకు సిబ్బందిని నియమించలేదు. దీంతో విలువైన ఫర్నిచర్ కూడ తుప్పు పట్టింది. దీంతో పాటు నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన మోటర్ చెడిపోయింది. మంచినీటి కుళాయిలు విరిగిపోయాయి.



వన విహారి కేంద్రం పరిస్థితి కూడా ఇదే:

పర్యావరణ విద్యాకేంద్రం పరిసరాల్లో 5 సంవత్సరాల క్రితం వన విహారి పేరుతో చిన్నారులు ఆట్లాడుకొనేందు కోసం లక్షల రూపాయలు వెచ్చించి ఇనుముతో జారుడుబండలు, ఊయ్యాలతో పాటు మరికొన్ని వస్తువులను ఏర్పాటు చేసారు. చిన్నారులతో పాటు పెద్దల కాలక్షేపం కోసం మరికొన్ని వసతులను నిర్మించారు. ఇవి కూడ కొద్ది రోజులకే పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి.



విలువైన వన్య ప్రాణుల అవయవాలు

రాత్రయితే అంధకారం.....

పర్యావరణ విద్యాకేంద్రం పరిసరాల్లో రాత్రయితే అంధకారమే. రాత్రి వేళల్లో అటువైపుగా చూస్తే భయాందోళనకు గురికాక తప్పదు. విద్యుత్ సౌకర్యం ఉన్నా నిధులు కొరతతో కనీసం కరెంట్ బిల్లులు చెల్లించడం లేదు. ఏపుగా పెరిగిన కంపచెట్లకు తోడు రహదార్లు కూడ సరిగా ఏర్పాటు చేయకపోవడంతో వర్షాకాలంలో పర్యాటకులు ఇక్కడ వడవడమే అతి కష్టంగా మారింది.



అధ్వానంగా ఉన్న రహదారి



భవనం పరిసరాల్లో విరిగిన కొళాయిలు

నిధుల కొరత వల్లే అభివృద్ధి చేయలేకపోతున్నాం

మహానందిలోని అటవీ పర్యావరణ విద్యాకేంద్రానికి నిధులు మంజూరు కాలేదు. దీని వల్లే విద్యాకేంద్రాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నాం. సిబ్బందికి కూడ జీతాలు ఇవ్వకపోవడంతో వారు పని మానేశారు. దీంతో ఆలనా పాలన కష్టమైంది. ఉన్న ప్రొటెక్షన్ వాచర్ల సిబ్బందిని నల్లమల పరిరక్షణ విధులకు కేటాయించాం. నేను ఈ పరిధిలో విధుల్లోకి వచ్చి ఏడాదైంది. ఇంతవరకు పర్యావరణ విద్యాకేంద్రానికి నిధులు మంజూరు కాలేదు. ఈ సమస్యను ఉన్నతస్థాయి దృష్టికి తీసుకెళతాను.

హైమవతి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్:



రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశం నిషిద్ధం

కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల (కల్చరల్), జూలై 10: మహానంది పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం నేపథ్యంలో రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం వెల్లడించారు. ఈ మేరకు ఆమె అటవీ ప్రాంతాల పరిసరాల్లోని ప్రజలను వీడియో ద్వారా అప్రమత్తం చేశారు. చిరుత సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లి ప్రమాదాలకు గురి కావొద్దని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్, పంచాయతీ, ఎండోమెంట్ అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో సభలను నిర్వహించి మరింత అప్రమత్తం చేస్తామన్నారు. మహానంది దేవస్థానానికి సంబంధించిన పూలు, పండ్లు, ఇతర వ్యర్థాలను అటవీ ప్రాంతంలో వేయడం కారణంగా కోతులు, కుక్కలు, ఇతర వన్యప్రాణులు రోడ్లపైకి వస్తాయన్నారు. వాటిని వేటాడేందుకు చిరుతపులి కూడా జనసంచారంలోకి వస్తోందన్నారు. అందుకే గోశాల చుట్టూ గ్రీన్‌నెట్ మరింత విస్తృతపరచాలని ఫారెస్ట్ అధికారులను ఆదేశించామన్నారు. పులుల సంరక్షణకు అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎలాంటి పరిస్థితులలో కూడా ప్రజలు, భక్తులు రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఎవరూ వెళ్లవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కోటకొండ పొలాల్లో పెద్దపులి!



రుద్రవరం మండలం చెలిమ ఫారెస్టు రేంజ్‌లోని కోటకొండ పంట పొలాల్లో పెద్దపులి పాదముద్రలు

రుద్రవరం, జూలై 10: గత కొంతకాలంగా మహానంది, రుద్రవరం మండలాల్లో చిరుతపులి సంచారం భయాందోళనను కలిగిస్తోంది. తాజాగా బుధవారం రుద్రవరం మండలం చెలిమ, ఫారెస్టు రేంజ్ పరిధిలోని కోటకొండ పొలాల్లో పెద్దపులి సంచరించినట్లు రైతులు గుర్తించారు. పెద్దపులి పాదముద్రలు పొలాల్లో స్పష్టంగా కనిపించాయి. దీంతో రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయపడుతున్నారు.



రుద్రవరం మండలం బి.నాగిరెడ్డిపల్లెలో అలుగు దెబ్బతిన్న సోమయాజుల చెరువు

143 జీఓ రద్దుకు కృషి చేస్తాం

● ఏపీ హంస సర్వసభ్య సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



సమావేశంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు(హాస్పిటల్), జూలై 10: వైద్య ఆరోగ్యశాఖని నిర్వీర్యం చేసే జీఓ.నెం.143ను అసెంబ్లీలో చర్చించి రద్దు చేసేందుకు కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఓల్డ్ సీఎల్‌జీలో ఏపీ హంస అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ ఆధ్వర్యంలో కర్నూలు తాలుకా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీ ల్యాండ్ నిధులను విడుదల చేసి ఏపీ హంసా భవన నిర్మాణానికి సహకరిస్తానని హామీనిచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ మాట్లాడుతూ 2011 నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉందని అర్హత ఉన్న ఉద్యోగులకు న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. పీఆర్‌సీ విషయంలో ఉద్యోగుల సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రఘుబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు టి. గోవిందు, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటస్వామి, నర్సింగ్ అసోసియేషన్ నాయకురాలు మంజుల, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ సంఘం నాయకులు రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెరువులపై చిన్నచూపు

● ఐదేళ్ల పాలనలో పైసా విదిలించని వైసీపీ ప్రభుత్వం
● శిథిలమైన తూములు, అలుగులు
● పిచ్చిమొక్కలతో పంట కాల్వలు ● ఆందోళనలో రైతులు

రుద్రవరం, జూలై 10: గత వైసీపీ ప్రభుత్వం చెరువులను చిన్న చూపు చూసింది. రైతు ప్రభుత్వమని చెప్పుకొన్నదేగాని చేసిందేమీ లేదు. చెరువులను నిర్లక్ష్యం చేయడంతో తూములు, గట్లు, అలుగులు దెబ్బతిన్నాయి. చెరువుల కింద ఆయకట్టు భూములకు నీరు అందక పంటలు రైతులకు చేతికి రాలేదు. రుద్రవరం మండలంలో చెరువుల దుస్థితి ఇది.

● రుద్రవరం మండలంలో 32 చెరువులు, కుంటలు ఉన్నాయి. సుమారు 2500 నుంచి 3వేల ఎకరాల వరకు ఆయకట్టు భూములు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల చెరువుల గట్ల వెంట కంపచెట్లు నిండి ఉన్నాయి.

పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పరిపాలన చేసినా చెరువుల మరమ్మతులకు పైసా విదల్చలేదు. రైతులు ప్రతి ఏటా ఎదురు చూసి ఐదేళ్లు గడిచిపోయాయి. కానీ చెరువులకు మరమ్మతులు చేయించలేదు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ రైతులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు గ్రామాలకు తలమానికం. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే చుట్టుపక్కల ఉన్న మంచినీటి పథకాలు, వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం పెరుగుతుంది.

శిథిలమైన తూములు, అలుగులు, గట్లు:

చెరువుల తూములు, అలుగులు శిథిలమయ్యాయి. పంట కాల్వల్లో కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. ఇలా చెరువులు దెబ్బతిన్నాయి. తూముల వద్ద గట్టుకు గండి పడి నీరంతా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇలా చెరువులు ఏటేటా నిర్లక్ష్యానికి గురై తూములు, అలుగులు దెబ్బతిన్నాయి. పంట కాల్వలు పిచ్చి మొక్కలు, కంపచెట్లు పెరిగాయి.

32 చెరువులు, కుంటలు

రుద్రవరం మండలంలో కొండమాయపల్లె చిన్నరాజచెరువు, రుద్రవరం పెద్ద రాజచెరువు, రంగారెడ్డి చెరువు, నాగలవరం చింతలచెరువు, టి.లింగందిన్నె వెంగనపల్లె చెరువు, ముకుందాపురం ఎర్రచెరువు, ఆలమూరు చీలబోయిన చెరువు, చందలూరు రాళ్లవాగుచెరువు, మాచినేనిపల్లె, చిన్నచెరువు, పెద్దచెరువు, ఎర్రగుడిదిన్నె, కొండరాజచెరువు, బి.నాగిరెడ్డిపల్లె, సోమయాజులచెరువు, పేరూరు, వావిలాల చెరువు, చిన్నకంబలూరు, కాటమ్మ, పెద్దచెరువు, కొత్తచెరువు, పెద్దకంబలూరు కేశిరాజుచెరువు, డి.కొట్టాల పెద్దచెరువు, బీరవోలు చెరువు, కోటకొండ కోలన చెరువుతో పాటు ఇంకా చెరువులు కుంటలు ఉన్నాయి. దాదాపుగా అన్నిట పరిస్థితి ఒకేలా ఉంది.

చెరువుగట్లకు గండ్లు

చెరువు గట్లకు అక్కడక్కడా గండ్లు పడి బలహీనంగా మారాయి. ముఖ్యంగా తూములు, అలుగుల సమీపంలో గట్లు బలహీనంగా మారాయి. కారణం.. సైడ్ గోడలు తూముల వద్ద బలహీనంగా మారి సాగునీరు వృథాగా పోతున్నది.

కురుస్తున్న వర్షాలు, వృథాగా పోతున్న సాగునీరు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుండి వర్షాలు కురుస్తున్నాయి. చెరువులకు వర్షం నీరు చేరినట్లే చేరి వృథా అవుతున్నది. కారణం.. తూములు సరిగా లేకపోవడమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం నీరు నిల్వ ఉంటేనే కదా.. ఆయకట్టు భూముల్లో సాగు చేసేది అని రైతులు వాపోయారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు.

చెరువు గట్టుకు గండి పడింది



కొండమాయపల్లె చిన్నరాజచెరువుకు గండి పడింది. వర్షం నీరు చెరువులో చేరి వృథా అయిపోతుంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇలాగైతే చెరువు ఆయకట్టు భూమి సాగు చేసేదెలా?

- నడిపి జమాల్, రైతు, కొండమాయపల్లె, రుద్రవరం మండలం

మరమ్మతులు చేయించండి



డి.కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న పెద్దచెరువు అలుగు, తూములకు మరమ్మతులు చేయించాలి. అలుగు దెబ్బతింది. చెరువులో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. నీరు ఆయకట్టు భూములకు సరిపోవడం లేదు.

- వెంకటరెడ్డి, రైతు, డి.కొట్టాల, రుద్రవరం మండలం

సాగునీరు వృథా కాకండా చూడండి



వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సాగునీరు వృథా కాకుండా చెరువుల్లో నిల్వ చేరేలా చర్యలు తీసుకోవాలి. చెరువులకు తూములు అలుగులు సరిగ్గా లేవు. ఇలా అయితే ఆయకట్టు భూముల సాగు ప్రశ్నార్థకంగా మారుతుంది.

- బాలనరసింహుడు, రైతు సంఘం నాయకులు, పెద్దకంబలూరు



రుద్రవరం మండలం డి.కొట్టాల చెరువు గట్టు అధ్వాన్నంగా..



రుద్రవరం మండలం బీరవోలు చెరువుగట్టు అధ్వానంగా ఇలా..



రుద్రవరం పెద్దరాజచెరువులో రబ్బరు మొక్కలు ఇలా..

పాలిసెట్ తుది విడత కౌన్సిలింగ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 10: కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు తుది విడత పాలిసెట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ బుధవారం తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 13వ తేదీ వరకు కౌన్సిలింగ్ ఫీజు వెబ్‌సైట్ ద్వారా చెల్లించి హాజరు కావాలన్నారు. నమోదు రుసుం ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.700 చెల్లించాలన్నారు. విద్యార్హతలో ధ్రువపత్రాల పరిశీలకు హాజరయ్యే విద్యార్థులు కౌన్సిలింగ్ ఫీజు రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, పదో తరగతి మార్క్స్ మెమో, 4 నుంచి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఈడబ్ల్యూఎస్ ఒరిజినల్స్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ తీసుకుని వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న విద్యార్థులు నిబంధనల ప్రకారం జూలై 11 నుంచి 14వ తేదీ వరకు కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు. ఎస్టీ అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన, బి. తాండ్రపాడు జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే జరుగుతాయన్నారు.

ఇద్దరు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హొళగుంద జడ్పీ పాఠశాలలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ కే. శ్రీనివాసమూర్తి, కోడుమూరు జడ్పీ పాఠశాల(బాలికలు)లో పని చేస్తున్న రికార్డు అసిస్టెంటు నాగరాజు విధులకు గైర్హాజరు అయ్యారని సీఈఓ పేర్కొన్నారు. శ్రీనివాసమూర్తి 10.08.2018 నుంచి, నాగరాజు 07.12.2022 నుంచి విధులకు గైర్హాజరయ్యారని, జడ్పీ కార్యాలయం నుంచి వీరికి షోకాజు నోటీసు, చార్జీ మెమో జారీ అయ్యాయని తెలిపారు. ఉద్యోగులు నేటి వరకు ఎలాంటి సంజాయిషీ సమర్పించలేదన్నారు. ఉద్యోగులు తక్షణమే జిల్లా పరిషత్ పరిపాలన భవనంలో హాజరు కావాలని లేని పక్షంలో ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 127, తేదీ: 15.9.2017, సీసీఏ రూల్స్ ప్రకారం తదుపరి క్రమశిక్షణ చర్యలు ఉంటాయని సీఈఓ పేర్కొన్నారు.

నగర పాలక సంస్థ డీఈఈ సరెండర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 10: నగర పాలక సంస్థలో పని చేస్తున్న డీఈఈ గోపాలక్రిష్ణను ఇంజనీర్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ కమిషనర్ ఏ. భార్గవతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ..ఓ డీఈఈ నిర్వాకం.. అనే కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు డీఈఈని సరెండర్ చేశారు. తదుపరి ఈఎన్‌సీ కార్యాలయం నుంచి ఆయనకు పోస్టింగ్ ఇవ్వనున్నారు.

మిద్దె పైనుంచి పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, జూలై 10: పెంపుడు పావురాలకు గింజలు పెట్టడానికి మిద్దె పైకి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మరణించాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన దూదేకుల చిన్న కుళ్లాయప్ప(68) ఇంటి మేడపై ఉన్న పావురాలకు గింజలు, నీళ్లు పెట్టడానికి వెళ్లి కాలుజారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన కుళ్లాయప్పను సుమారు గంటపాటు కుటుంబ సభ్యులెవ్వరూ గమనించలేదు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సీఐ గోపినాథ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మా పొలం మాకు ఇప్పించండి

- వృద్ధ దంపతుల వేడుకోలు


తహసీల్దార్‌కు విన్నవించుకుంటున్న వృద్ధ దంపతులు

చిప్పగిరి, జూలై 10: మా పొలం ఇప్పించి న్యాయం చేయాలని చిప్పగిరి మండలం బంటనహాల్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ ఏళ్లతరబడి తిరుగుతున్నా తమకు న్యాయం జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 145లోని భూమిని అడంగల్‌లో ఇతరుల పేరుమీద మార్చుకుని అన్యాయం చేశారని బంటనహాల్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు గోవిందమ్మ, లక్ష్మీదేవి మంగళవారం తహసీల్దార్ ఎదుట వాపోయారు. తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ పద్మ మాట్లాడుతూ బంటనహాళ్ గ్రామంలో సర్వే నెంబర్ 145లో రెండు ఎకరాల పొలం ముగ్గురికి సమభాగం ఉందని, వీరిలో ఒకరు నిబంధనలకు విరుద్ధంగా తన పేరు మీద మార్చుకొని భూమిని విక్రయించిందన్నారు. అప్పటి అధికారులు రికార్డులు తారుమారు చేయడం వల్లే ఇలా జరిగిందన్నారు. ఉన్నతాధికారులకు నివేదికల పంపామని, ఆర్డీఓ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పకడ్బందీగా పొలంబడి

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 10: పంటల సాగులో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడానికి గతం కంటే సమర్థవంతంగా పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పొలంబడి కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. అయితే ప్రస్తుత ఖరీఫ్ నుంచి పొలంబడి కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసు (గ్యాప్) కింద ఈ పొలం బడి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తామని జేడీ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో డిప్యూటీ తహసీల్దార్ మృతి


కర్నూలు, జూలై 10: నంద్యాల సివిల్ సప్లయ్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వీణా కుమార్(42) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మూడో పట్టణ సీఐ మురళిధర్ రెడ్డి తెలిపారు. వీణా కుమార్ స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఓ బార్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా.. స్థానికులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వ వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి జ్యోతి తన కుమారుడు వీణాకుమార్ మృతిపై విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థిని పరామర్శించిన అధికారులు

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు మెమోలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ ఈఓ పి.వెంకటలక్ష్మమ్మ


కర్నూలు జీజీహెచ్‌లో బాలుడిని పరామర్శిస్తున్న అధికారులు, వైద్యులు

ఆదోని రూరల్, జూలై 10: విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన అంగన్‌వాడి విద్యార్థి హుసేనిని జిల్లా అధికారులు బుధవారం పరామర్శించారు. ఇస్వీ గ్రామానికి చెందిన ఈరమ్మ, బసవరాజుల ఐదేళ్ల కుమారుడు స్థానిక అంగన్‌వాడీ-2 సెంటర్‌కు మంగళవారం వెళ్లాడు. అయితే మరో విద్యార్థితో కలసి హుసేని బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బాలుడు పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో ఆ బాలుడిని మెరుగైన వైద్య చికిత్సల కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని మహిళా శిశు సంక్షేమ శాఖ ఈఓ పి.వెంకటలక్ష్మమ్మ బుధవారం పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలుడు హుసేనికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. బాలుడి ఆరోగ్యంపై ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని తల్లిదండ్రులకు ఆమె భరోసానిచ్చారు. ప్రమాద ఘటనపై ఆమె విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని సెంటర్లలో ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ కార్యకర్త జయలక్ష్మి, సూపర్‌వైజర్, సీడీపీఓ, విద్యుత్ లైన్‌మెన్, ఏఈలకు మెమోలు ఇచ్చినట్లు వెల్లడించారు.



అప్రోచ్ కాలువలో గాలిస్తున్న ఏపీడీఆర్ఎఫ్ బృందం


ఎస్పీకి చేతులెత్తి మొక్కుతున్న వాసంతి బంధువులు


రోదిస్తున్న వాసంతి తల్లి సుజాత

ముచ్చుమర్రిలో ముమ్మర గాలింపు

- రెండో రోజూ లభించని వాసంతి ఆచూకీ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీలు
- తరలివచ్చిన చుట్టుపక్క గ్రామాల ప్రజలు
- అప్రోచ్ కాలువలో రెస్క్యూటీం ముమ్మర గాలింపు
- రంగంలోకి ఏపీడీఆర్ఎఫ్ బలగాలు



నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 10: అభం శుభం తెలియని చిన్నారి వాసంతి మిస్సింగ్ హిస్టరీ తేలడం లేదు. రెండు రోజులుగా ముచ్చుమర్రి ఎత్తిపోతల అప్రోచ్ కాలువలో పోలీసులు, గజ ఈతగాళ్లు, రెస్క్యూటీం చేస్తున్న ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముమ్మరంగా గాలింపు చర్యలు జరుగుతున్నా చిన్నారి వాసంతి జాడ తెలియలేదు. నాలుగు రోజుల క్రితం ఆదివారం పగిడ్యాల మండలం పాతముచ్చుమర్రి గ్రామంలో బాలిక వాసంతి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కస్టడీలో ఉన్న ముగ్గురు మైనర్ బాలురు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రెండు రోజులుగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో గాలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిరంతరాయంగా గాలింపు చర్యలు చేపట్టినా కూడా నిరాశే మిగిలింది. ఘటనా స్థలానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు భరోసానిచ్చారు. తమ బిడ్డకు న్యాయం చేయాలంటూ వాసంతి తండ్రి మద్దిలేటి, బంధువులు ప్రాధేయపడుతున్నారు. 'మీ కాళ్లు మొక్కుతాం సార్... మా పాపను మాకు అప్పగించం డి..' అంటూ వాసంతి తల్లిదండ్రులు ఎస్పీ రఘువీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిల కాళ్లపై పడి వేడుకోవడం కలచివేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో 15 మంది ఏపీడీఆర్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీఓ దాసు, ఎస్ఐ మహేంద్ర ఇతర అధికారులు ముచ్చుమర్రి వద్దే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

మాట మార్చుతున్న మైనర్లు

బాలికను హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్న ముగ్గురు బాలురు ఒక్కోసారి ఒక్కోలా మాట మార్చుతూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువ వద్దకు మైనర్ బాలురను తీసుకెళ్లగా రెండు ప్రాంతాల్లో మృతదేహాన్ని వేసినట్లు చూపించారు. ఆ రెండు ప్రదేశాల్లో మంగళవారం, బుధవారం సాయంత్రం 5:30 గంటల వరకు వెతికారు. ఇదే క్రమంలో మైనర్ బాలురు తిరిగి ముచ్చుమర్రి పంపు హౌస్ ముందు భాగంలో శవాన్ని వేశామని చెప్పడంతో అక్కడ గాలింపు చర్యలు చేపట్టారు.

● మా బిడ్డకు పట్టిన గతే వారికి పట్టాలి

- మద్దిలేటి, వాసంతి తండ్రి

అభంశుభం తెలియని నా కూతురిని తీసుకెళ్లి చంపేదుకు వారికి చేతులు ఎలా వచ్చాయి. మాయమాటలు చెప్పి ఇక్కడికి తీసుకువచ్చి చంపేశారు. మా కూతురిని ఎలాగైతే చంపారో వారిని కూడా చట్టపరంగా ఉరి తీయాలి. అప్పుడే మాకు న్యాయం జరిగినట్లు.

● కంట తడిపెట్టిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల ఎంపీ బైరెడ్డి డాక్టర్ శబరి సంఘటన స్థలానికి చేరుకుని వాసంతి తండ్రి మద్దిలేటి, తల్లి సుజాతమ్మలను పరామర్శించారు. ఈ క్రమంలో తల్లిదండ్రులతో పాటు బంధువులు ఎంపీ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో ఎంపీ కూడా చలించిపోయి కంటతడి పెట్టారు. వాసంతి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారని, నిజానిజాలను పోలీసులు వెలికితీస్తారని, ఈ ఘటనలో నిందితులు ఎవరు ఉన్నా ఉపేక్షించేది లేదని ఆమె అన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉంటామన్నారు.


కంటతడి పెడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి డాక్టర్ శబరి

● ఎంతటివారినైనా శిక్షిస్తాం

- గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే, నందికొట్కూరు


పోలీసుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సంఘటన స్థలానికి చేరుకుని రూరల్ సీఐ విజయభాస్కర్, ఇతర ఎస్ఐలతో జరిగిన సంఘటనపై ఆరా తీశారు. వాసంతి తండ్రి మద్దిలేటి ఎమ్మెల్యే ఎదుట బోరున విలపించారు. ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి ధైర్యంగా ఉండాలంటూ ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఘటన జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

● జీర్ణించుకోలేకపోతున్నాం

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే


బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

బాలిక వాసంతిపై జరిగిన ఈ ఘటన జీర్ణించుకోలేకపోతున్నాం. శవం లభిస్తే కొంత వరకైనా తల్లిదండ్రులకు మన శాంతి ఉంటుంది. నిందితులు ఎవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రాన్నే ఈ ఘటన కుదిపేసింది. రకరకాలుగా హింసించి చంపి ఉంటారని భావిస్తున్నాం. ఐదేళ్లుగా గ్రామంలో క్రమశిక్షణ లేకుండా పోయింది. ఐదేళ్లలో రౌడీలకు పెత్తనం ఇచ్చి సర్వనాశనం చేశారు. గ్రామంలో క్రమశిక్షణ తీసుకువచ్చేందుకు పోలీసుల సహకారం తీసుకుంటాం. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. 15 రోజుల్లో గ్రామ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

అవినీతి వీఆర్వోని సస్పెండ్ చేయాలి

- అవినీతి సొమ్మును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- కలెక్టరేట్ ఎదుట విద్యార్థి, ప్రజాసంఘాల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 10: అవినీతికి పాల్పడిన వీఆర్వోని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ తలారి నుంచి వీఆర్వోగా పదోన్నతిపొందిన అధికారి రూ.కోట్లలో అక్రమాస్తులు సంపాదించాడన్నారు. అప్పట్లో వైసీపీ నాయకులతో అంటకాగుతూ ఇలా అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. వైసీపీ నాయకుల అండదండలతో నగరంలో 300కుపైగా పట్టాలు ఇచ్చి అక్రమంగా రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. 11 ఎకరాల భూమిని ఒక కార్పొరేటర్ మాజీ ఎమ్మెల్యే అనుచరులు ఆన్‌లైన్ చేయించినందుకు రూ.25 లక్షలు లంచం తీసుకున్నాడన్నారు. వీకర్‌సెక్షన్ కాలనీలో ఒక వ్యక్తికి కొత్తగా పట్టా ఇచ్చినందుకు రూ.50వేలు, రాజీవ్ గృహకల్ప వద్ద ఎకరా కాలువ పోరంబోకు భూమిని ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్ ఇచ్చినందుకు ఆ వ్యక్తి నుంచి రూ.10 లక్షలు లంచం తీసుకున్నాడని ఆరోపించారు. వాగు, పోరంబోకులో రెండు ఎకరాల భూమిని ఒక కార్పొరేటర్‌కు ఆన్‌లైన్ చేయించి పుస్తకాలు ఇచ్చినందుకు వీఆర్వో 9 సెంట్లు స్థలాన్ని అక్కడే తీసుకున్నాడని ఆరోపించారు. అవినీతి వీఆర్వోపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హుశేన్‌బాషా, నగర అధ్యక్షుడు గౌతం, జిల్లా నాయకులు రామకృష్ణ, యేసు, నాయకులు నాగరాజు, చంద్ర, షేక్షావలి పాల్గొన్నారు.

అన్నా.. ఆ పోస్టు నాకు ఇవ్వాలి

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు భారీగా డిమాండ్



మద్దికెర, జూలై 10: ఎన్డీయే కూటమి అధి కారంలో రావడంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు పోటీ పెరిగింది. పలు గ్రామాల్లో తమకంటే తమకే పోస్టులు ఇప్పించాలని టీడీపీ కార్యకర్తలు పోటీ పడుతున్నారు. దీంతో పార్టీలోని ద్వితీయ శ్రేణీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. మండలంలో మొత్తం ఎనిమిది పంచాయతీలు ఉన్నాయి. ఎం.అగ్రహారం, పెరవలి, బసినేపల్లి, ఎడవలి గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు ఐదుగురి నుంచి ఆరుగురి వరకు పోటీ పడుతున్నారు. పోటీ పడేవారంతా ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేసిన వారే. గత వైసీపీ ప్రభుత్వం లో ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించి వైసీపీ కార్యకర్తలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియ మించుకున్నారు. పలు అవినీతి అక్రమాలు జరిగాయనీ ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ల ఎంపిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసిం ది. మండలాల వారీగా సమావేశాలు నిర్వహిం చి నేతలందరి సమష్టి నిర్ణయం మేరకు పోస్టులను భర్తీ చేస్తామని ఆయన పార్టీ నేతలకు సూచించినట్లు తెలిపారు. పదవులు ఇప్పిస్తామని చెప్పి ఎవరైనానాయకులకు డబ్బు లు ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాననీ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హెచ్చరించినట్లు సమాచారం. దీంతో ఆ గ్రామాల పరిధిలోని నాయకులు పని చేసిన టీడీపీ కార్యకర్తలనే నియమించుకోవాలని ఏకాభిప్రాయం వచ్చినట్లు తెలిపారు.

ఆర్ఎంపీ ఇన్‌జక్షన్‌తో బాలుడు మృతి

నకిలీ వైద్యుడిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ


బాలుని అమ్మమ్మ బస్సమ్మను విచారిస్తున్న డీప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి

గోనెగండ్ల, జూలై 10: గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో బడేసావలి అనే నకిలీ వైద్యుడు వేసిన ఇన్‌జెక్షన్ వికటించి అదే గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలుడు రాజేష్ మృతి చెందడంపై బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, స్థానిక వైద్యులు కార్తీక్ విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితం వైద్యం వికటించి బాలుడు మృతి చెందాడు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి మృతి చెందిన బాలుని అమ్మమ్మ బోయ బస్సమ్మను విచారించి వాస్తవాలను తెలుసుకున్నారు. బాలుడు స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. 15 రోజుల క్రితం రాజేష్‌కు జ్వరం వచ్చింది. తల్లిదండ్రులు రాజేశ్వరి, నాగరాజు గ్రామంలో ఉన్న బడేసావలి అనే నకిలీ వైద్యుడిని ఆశ్రయించారు. అతడు చేసిన ఇన్‌జెక్షన్ మూడు రోజులకు వికటించింది. ఇన్‌జెక్షన్ వేసిన చోటి నుంచి చీము, రక్తం రావడంతో కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆరు రోజలపాటు రూ. 6.50 లక్షలు ఖర్చు చేసుకున్నా నయంగాక మృతి చెందాడని బస్సమ్మ బోరున విలపిస్తు విచారణలో తెలిపారు. అలాగే వైద్యం చేసిన బడేసావలిని కూడా అధికారులు విచారించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు ఇన్‌జెక్షన్ వేయరాదని అన్నారు. విచారణ జరిపి నివేదికను డీఎంహెచ్‌వోకు పంపుతామని ఆయన నిర్ణయం ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు.

ఖైదీల్లో సత్ప్రవర్తన కోసం కృషి చేయాలి: ఎంపీ


జైలును పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(లీగల్), జూలై 10: ఖైదీల్లో సత్ప్రవర్తన పెరిగేలా జైలు అధికారులు కృషి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. ఎంపీ హోదాలో ఆయ న మొదటిసారి జిల్లా జైలును బుధవారం సందర్శించారు. ఆయన వివిధ కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలను కలిసి వారికి అందిస్తున్న భోజన, ఇతర సదుపాయాల గురిం చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు నిబంధనలకు అనుగుణంగా ఖైదీలకు అన్ని వసతి సౌకర్యాలు కల్పించాలని, వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను కోరారు.

క్రాప్ లోన్ మంజూరుకు బ్యాంకు అంగీకారం

కర్నూలు(లీగల్), జూలై 10: నిబంధనల మేరకు అన్ని షరతులు పూర్తి చేసిన రైతుకు క్రాప్ లోన్ మంజూరు చేయడానికి బ్యాంకు అంగీకరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు బి. లీలా వెంకట శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాకు చెందిన రంగస్వామి అనే రైతు రుద్రవరం మండలంలో ఉన్న తన భూమి మీద క్రాప్ లోను తీసుకున్నాడు. 2012 నుంచి ఈ రైతు చాలాసార్లు క్రాప్ లోన్ తీసుకుంటూ తిరిగి చెల్లించేవాడు. అదే విధంగా గత ఏడాది కూడా దరఖాస్తు చేసుకున్నాడు. అన్ని నిబంధనలు పూర్తిచేసినా కెనరా బ్యాంకు రైతుకు రుణం మంజూరు చేయలేదు. దీంతో ఆయన న్యాయవాది పి శివసుదర్శన్ ద్వారా శాశ్వత లోక్‌అదాలత్‌ను ఆశ్రయించాడు. అదాలత్ కెనరా బ్యాంకుకు నోటీసు జారీ చేయడంతో బ్యాంకు అధికారులు బుధవారం హాజరై రైతుకు క్రాప్ లోన్ కింద రూ.90వేలు మంజూరు చేశారు.

తెరుచుకున్న పాఠశాల

● ఉపాధ్యాయురాలి నియామకంతో గిరిజనుల హర్షం



విద్యార్థులకు చదువు చెబుతున్న పంతులమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొత్తపల్లి, జూలై 10: కొత్తపల్లి మండలంలోని జానాలగూడెంలో గత ఏడాది కాలంగా ఆ పాఠశాలకు ఉపాధ్యాయులు లేక పోవడంతో బడికి తాళం వేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో జానాల గూడెంలో బడికి తాళం.. అడివిబాటలోకి విద్యార్థులు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. వీటిపై నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి స్పందించారు. తక్షణమే ఐటీడీఏ అధికారులతో చర్చించి అంకమ్మ అనే ఉపాధ్యాయినిని నియమించారు. గ్రామంలో 120 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. 15 ఏళ్ల క్రితం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది ఈ పాఠశాలలో 26 మంది విద్యార్థులు చదువుకునేవారు. అయితే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో ఈ అటవీ ప్రాంతానికి ఏ ఉపాధ్యాయుడు రావడానికి సాహసించలేదు. అయితే.. ప్రస్తుత ఎమ్మెల్యే గిత్తా జయసూర్య స్పందించి అక్కడ ఉపాధ్యాయురాలిని నియమించడానికి కృషి చేశారు. దీంతో అడవిబాట పట్టిన గిరిజన విద్యార్థులు ఇప్పుడిప్పుడే బడిబాట పట్టడం వల్ల గూడెం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'



మొక్క నాటుతున్న తహసీల్దార్

పాములపాడు, జూలై 10: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. పాములపాడులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో రోజు రోజుకూ కాలుష్యం పెరిగిపోతోందని, మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీటీ పఠాన్‌బాబు, ఈశ్వరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం

పాములపాడు, జూలై 10: పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సరస్వతి ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బుధవారం ఏపీవో విమలమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఎఫ్ఏ, టీఎలు హార్టికల్చర్‌కు 150 ఎకరాల టార్గెట్‌ను పూర్తి చేయాలని, ఫారం పాండ్స్ కలిగిన గ్రామాలలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులను పూర్తి చేయాలన్నారు.

'బోధన ప్రశాంతంగా జరిగేలా చూడాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల (కల్చరల్), జూలై 10: నంద్యాల జిల్లాలో గల పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ సభ్యుడు సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కలెక్టర్ రాజకుమారిని కోరారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై కొన్ని చోట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు దాడులు చేయడం, విమర్శించడం, మీడియాకు, పత్రికలకు, అసత్య ఆరోపణలు చేయడం వల్ల ఉపాధ్యాయులు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులు పాఠశాల సామగ్రిని ధ్వంసం చేయడం, ఉపాధ్యాయులను ఎదిరిస్తున్నారని చెప్పారు. కొలిమిగుండ్ల మండలం కోరుమానుపల్లె ఉపాధ్యాయుడిని చౌకదుకాణం డీలర్ తీవ్రమైన అసభ్య పదజాలంతో తిట్టడం భయభ్రాంతులకు గురిచేసిన ఘటనపై బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులకు తగు రక్షణ కల్పించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ నాయకులు మల్లెల పుల్లయ్య, ఆవుల మునిస్వామి, ఎం.ప్రతాపరెడ్డి, సిరివెళ్ల మండల ప్రధాన కార్యదర్శి నగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్ఐసీ పాలసీలపై జీఎస్టీ తొలగించాలి'



మాట్లాడుతున్న ఐసీఈయూ నాయకులు

ఆత్మకూరు రూరల్, జూలై 10: ఎల్ఐసీకి వినియోగదారులు చెల్లించే ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని ఆత్మకూరు ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోషియేషన్ కడప డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు అవధానం శ్రీనివాసులు, రఘునాధరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆ అసోషియేషన్ 33వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో చేస్తున్న సవరణలతో కార్మికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. బీమా పరిశ్రమ, బీమా ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఎల్ఐసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. అనంతరం ఆత్మకూరు డివిజన్ ఆ సంఘం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, సెక్రటరీగా మనోజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా నాగన్న, ట్రెజరర్‌గా ఇస్మాయిల్ జబివుల్లాతో పాటు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం డివిజనల్ ఉపాధ్యక్షుడు అక్బర్‌బాషా, జోనల్ మెంబర్ సునయ కుమార్, జిల్లా నాయకులు రమేష్ బాబు, బ్రాంచ్ మేనేజర్ పాండురంగనాయక్, ఏటీఎం మధుసూదన్, ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కలను సాకారం చేసుకుందాం

● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



స్వచ్ఛభారత్ ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూలై 10: స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్ కలను సాకారం చేసుకుందామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. బుధవారం నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద నందికొట్కూరు మండలంలోని అల్లూరు, వడ్డెమాను, దామగట్ల గ్రామాలకు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ కింద స్వచ్ఛభారత్ నిర్మాణంలో భాగంగా మూడు గ్రామాలకు ట్రాక్టర్లు మంజూరు అయ్యాయని అధికారులు తెలిపారు. వాటిని ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంజూరైన ట్రాక్టర్లను గ్రామపంచాయతీ సర్పంచ్, గ్రామ కార్యదర్శులు సద్వినియోగపరచాలని సూచించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పోగైన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి గ్రామాన్ని ఎంతో స్వచ్ఛంగా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అప్పుడే గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలకుండా గ్రామాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ఎంపీడీవో నరేష్ కృష్ణ, ఈవోఆర్డీ సంజన్న మాట్లాడుతూ మండలంలో రెండు వేల జనాభా దాటిన గ్రామాలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద స్వచ్ఛభారత్ నిర్మాణంలో భాగంగా ఈ ట్రాక్టర్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇంకా కొన్ని గ్రామాలకు రావాల్సి ఉందన్నారు. సర్పంచులు రామచంద్రుడు, చిన్న నాగలక్ష్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'



గడివేముల తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న స్కీమ్ వర్కర్లు

ఆత్మకూరు, జూలై 10: కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శి రజాక్, రామ్‌నాయక్ కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయం నుంచి కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస రూ.26వేలు ఇవ్వాలన్నారు. తహసీల్దార్ బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, విజయలక్ష్మీ, ప్రియాంక, రవణమ్మ, ఆశా కార్యకర్తలు ఇందిరమ్మ, జ్యోతి, శాంతి, సామక్క, సీఐటీయు నాయకులు రణధీర్, మల్లయ్య, ప్రజాసంఘాల నాయకులు స్వాములు, స్వామన్న, వెంకటేశ్వరరావు, వీరన్న, దినేష్ తదితరులు ఉన్నారు.

మహానంది: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మహానంది మండల తహసీల్దార్ కార్యాలయం ముందు మండల అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేపట్టారు. బుధవారం జూలై 10 కోర్కెల దినం సందర్భంగా ఏపి అంగన్‌వాడీ వర్కర్స్, సీఐటీయూ మహానంది మండల కమిటీ నాయకులు సోమన్న, శంకయ్యతో పాటు మండల అంగన్‌వాడీ వర్కర్లు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు.

వెలుగోడు: లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆల్‌ఇండియా కమిటీ పిలుపులో భాగంగా అంగన్‌వాడీ ఆశావర్కర్లు బీవోఏలు ఆటో కార్మికులు హమాలీ వర్కర్స్ గ్రామ పంచాయతీ కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, మండల నాయకులు మహ్మద్‌రఫీ, అంగన్‌వాడి వర్కర్స్ మండల నాయకురాలు భాగ్యలక్ష్మీ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మీ, గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు రైతు సంఘం నాయకలు యాదాటి నాగేంద్రుడు నాగమోహన్ పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులో మండలంలోని అన్ని సెంటర్ల అంగన్వాడీలతో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు శివలక్ష్మి, రవణమ్మబాయి, అంగన్‌వాడీ సిబ్బంది హెల్పర్లు పాల్గొన్నారు.

గడివేముల: తమ డిమాండ్‌లను నెరవేర్చాలని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఆటో యూనియన్ నాయకులు బుధవారం తహసీల్దార్ జమానుల్లాఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీలు, ఆటో, హమాలీ పాల్గొన్నారు.

మిడుతూరు: స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మిడుతూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ మండల అధ్యక్షుడు లింగస్వామి అధ్యక్షతన బుధవారం ధర్నా చేశారు. సీనియర్ అసిస్టెంట్ రాంభూపాల్ రెడ్డికి వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు, యూనియన్ నాయకులు లక్ష్మీకుమారి, సుబ్బమ్మ, భువనేశ్వరి, శారదమ్మ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: అంగన్వాడీ, ఆశకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ బుధవారం ఎంపీడీవో కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎంపీడీవో నూర్జహాన్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కర్ణ, నరసింహ, వెంకటరమణమ్మ, పావని, పద్మావతి అంగన్‌వాడీలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

'విద్యా వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ'

పాములపాడు, జూలై 10: వైసీపీ ప్రభుత్వంలో పాఠశాల విద్య నాశనం అయ్యిందని డీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం, ఏసేపు, జిల్లాశాఖ అధ్యక్షుడు కిశోర్, ఉపాధ్యక్షుడు స్వామిశేఖర్, జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పాములపాడులోని ఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు రవి పాల్గొన్నారు

సమస్య పరిష్కారం

వెలుగోడు, జూలై 10: వెలుగోడు పట్టణంలోని పంప్‌హౌస్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు ఖలీల్, హుసేన్‌లు విద్యుత్ శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన అధికారులు పంప్‌హౌస్ వద్దకు చేరుకుని కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి అంతరాయంగా మారడంతో ఎక్స్‌వేటర్‌ను రప్పించి పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన

కొత్తపల్లి, జూలై 10: మండలంలోని దుద్యాల గ్రామంలో మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు మొవ్వు తినడం వల్ల కత్తిరించినట్లు కనిపిస్తుందని, అలాగు పురుగు తిని విసర్జించిన మలంతో మొవ్వు నిండి ఉంటుందని చెప్పారు. సిబ్బంది శేషు, పల్లవి, రైతులు పాల్గొన్నారు.

'ఫీజులో రాయితీ ఇవ్వాలి'

పాణ్యం, జూలై 10: జర్నలిస్టుల పిల్లల ఫీజులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ బుధవారం నంద్యాల జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఏడీ చౌడేశ్వరికి పాణ్యం మండల ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ మండల అధ్యక్షుడు ఏకే శ్రీనివాసులు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు కార్పోరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక సేవలో భాగంగా పని చేసే జర్నలిస్టులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు కేటాయించాలన్నారు. జర్నలిస్టులకు భద్రత కల్పించాలన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు అప్సర్‌బాషా, ఇప్పా సుధాకర్, శ్రీనివాసులు, రవి, నబి పాల్గొన్నారు.

'చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలి'

నంద్యాల రూరల్, జూలై 10: చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని పెద్దకొట్టాల సర్పంచ్ రమణ అధికారులను కోరారు. నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో పెద్దకొట్టాలలో గ్రామ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అయితే అందుకు సంబంధించి బిల్లులు ఇంతవరకు రాలేదని పెద్దకొట్టాల సర్పంచ్ రమణ అధికారుల దృష్టికి తెచ్చారు. బిల్లులు రాక చేసిన అప్పులు తీర్చలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అయ్యలూరు సర్పంచ్ ఓబులేసు మాట్లాడుతూ దళితుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఏ సమాచారం ఇవ్వలేదని సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో సౌభాగ్యం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాయి భక్తుల భిక్షాటన

ఆత్మకూరు రూరల్, జూలై 10: ఆత్మకూరు పట్టణంలోని సాయిబాబా నగర్‌లో వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానంలో జులై నెల 21వ తేదీన నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆ ఆలయ కమిటి అధ్యక్షులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం సాయిభక్తులు భిక్షాటన చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణంలో, పలు గ్రామాలలో సాయి భక్తులు భిక్షాటన చేశారు.

వేలం పాటలో తగ్గిన ఆదాయం

గడివేముల, జూలై 10: మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయ భూముల కౌలు వేలం పాటలను బుధవారం నిర్వహించగా ఈ ఏడాది ఆదాయం తగ్గింది. 24 ఎకరాలు సాగు చేసుకునేందుకు వేలం పాటలు నిర్వహించగా 17 మంది వేలం పాటలో పాల్గొన్నారు. పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించిన ఈ వేలం పాటలో 24 ఎకరాలకు రూ.4.46 లక్షలు పాట పాడినట్లు ఆలయ పర్యవేక్షణాధికారి శశికుమార్ తెలిపారు. గతంతో పోలిస్తే రూ.3 లక్షలు ఆదాయం తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'మొక్కజొన్న సాగులో జాగ్రత్తలు పాటించండి'



మొక్కజొన్న సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న శాస్త్రవేత్త

ఆత్మకూరు, జూలై 10: మొక్కజొన్న సాగుచేసిన రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయానికి చెందిన ఏరువాక కేంద్రం నంద్యాల ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త రామకృష్ణారావు, ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ సూచించారు. బుధవారం వారు ఆత్మకూరు మండల పరిధిలోని నల్లకాల్వ, బాపనంతాపురం గ్రామాల్లో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ప్రత్యేకించి 15 నుంచి 20రోజుల దశలో ఉన్న పంటలో అధిక వర్షంతో నీరు నిలిచినట్లు వారు గుర్తించారు. దీంతో అధిక వర్షాల నేపథ్యంలో పంటను కాపాడుకునే పలు సూచనలకు రైతులకు అవగాహన కల్పించారు. పంట పొలాల్లో వర్షపునీరు, తేమ అధికంగా ఉండటం వల్ల మొదళ్లు, వేరు కుళ్లే ప్రమాదం ఉండటంతో అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా మొక్కజొన్న పంటను ఆశిస్తున్న కత్తెర పురుగు తీవ్రత గురించి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు కత్తెరపురుగును ఏవిధంగా కట్టడి చేయాలన్న అంశాల గురించి తెలియజేశారు. కాగా రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలని అలాంటప్పుడే అధిక దిగుబడులు పొందవచ్చునని వెల్లడించారు. అనంతరం మొక్కజొన్న సాగులో రైతులకు నెలకొన్న పలు సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది అరవింద్, కావ్య, రాజమ్మ తదితరులు ఉన్నారు.

లోపించిన పారిశుధ్యం



కొత్తపల్లి: బస్టాండు సెంటరులో రోడ్డుపై మురుగు



పాణ్యంలో దేవదాయశాఖ స్థలంలో నిలిచిన మురుగు

కొత్తపల్లి, జూలై 10: కొత్తపల్లిలోని తెలుగుపేట, గొల్లపేట, మద్దికె, బస్టాండు సెంటర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది అతిసార ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో పర్యవేక్షణలో ఈవోఆర్డీ, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అంతేగాకుండా గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులు పదిహేను రోజులకొకసారి శుభ్రం చేసి సంబంధిత తేదీలను ట్యాంకులపై ప్రదర్శించాల్సి ఉంది. అంతేగాకుండా వర్షాకాలంలో మురుగు కాలువలు, చెత్తకుప్పలు ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉంది.

పాణ్యం: స్థానిక అయ్యపురెడ్డి కాలనీ సమీపంలోని దేవదాయశాఖ స్థలంలో మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిల్వ ఉండి దాదాపు ఐదెకరాల స్థలంలో ముళ్ల పొదలు, కంప చెట్లు పెరిగి నీరు మురుగుగా మారి దోమలకు నిలయంగా మారింది. దీంతో స్థానికులు బుధవారం తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. నీటిని తొలగించి ముళ్లపొదలు తొలగించాలని కోరారు. దేవాదాయ స్థలం నిరుపయోగంగా మారి మురుగునీరు నిల్వ ఉండడంతో ఎస్పార్బీసీ, అ య్యపురెడ్డి కాలనీల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా మురుగునీరు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలను అధిగమించండి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 10: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఉపాధి హామీ, గ్రామవార్డు సచివాలయాల పనితీరుపై సమీక్షించారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఎల్‌డీవో కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి చేపట్టిన 95 పనుల్లో వేతన సంబంధిత పనులు, మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టిన పనుల వివరాలను ఇవ్వాలని సూచించారు. దినసరి వేతన కూలి రూ.300 కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుండగా.... సగటున చెల్లిస్తున్న రోజు కూలి 239 మాత్రమే ఉందని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయించి సగటున రూ.300 కూలి మొత్తాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించి గుర్తించిన 16 రకాల పండ్ల మొక్కలను రైతులు నాటుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 409 గ్రామ సచివాలయాలు, 107వార్డు సచివాలయాల్లో 4598 సచివాలయ సిబ్బంది పని చేస్తున్నారని, అప్పగించిన పీజీఆర్ఎస్ పనులు పూర్తిచేయడంతో పాటు బయోమెట్రిక్ అటెండెన్స్ కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఎల్‌డీవోను ఆదేశించారు.

'బస్సు సౌకర్యం కల్పించాలి'

ఆత్మకూరు రూరల్, జూలై 10: సిద్ధాపురం గ్రామం నుంచి వెంకటాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగార్జున ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ డిమాండ్ చేశారు. వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ సిద్ధాపురం నుంచి వెంకటాపురానికి బస్సు సౌకర్యంలేక విద్యార్థులు ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని, ఈ పాఠశాలలో దాదాపు వంద మంది విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో పాఠశాలకు వస్తూ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఆటోల కోసం ఎదురు చూస్తూ సమయానికి పాఠశాలకు చేరుకోలేక పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ప్రజాప్రతినిధులు చొరవ చూపి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు.

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు



మిడుతూరులో ఎండలో నిలిచిన ప్రయాణికులు

మిడుతూరు, జూలై 10: మిడుతూరులో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. మిడుతూరు నుంచి నంద్యాల, ఓర్వకల్లు, కడుమూరు, కర్నూలు, చెరుకుచెర్ల, తిమ్మాపురం, అలగనూరు, జలకనూరు గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు మిడుతూరు బస్టాండు ఆవరణలో వేచి ఉంటున్నారు. బస్సుల కోసం నిరీక్షించలేక ఎండలకు, వానలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా నాయకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి మిడుతూరు బస్టాండు ఆవరణలో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'చిరుతపులి నుంచి కాపాడాలి'

మహానంది, జూలై 10: గత నెల రోజులుగా కంటికి కునుకు లేకుండా చేస్తున్న చిరుతపులి నుంచి తమను కాపాడాలని మహానంది పంచాయతీ పరిధిలోని ప్రజలు అధికారులను కోరారు. బుధవారం మహానంది సమీపంలోని సచివాలయంలో మండల తహసీల్దార్ బి.రామచంద్రుడు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డితో పాటు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి, మహానంది ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధుతో పాటు వివిధ శాఖల అధికారులు చిరుతపులి నుంచి ప్రజలను ఏవిధంగా కాపాడాలనే అంశంపై సర్పంచ్ చలం చలం శిరీష ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. చిరుతపులి సంచారాన్ని ఎలా కట్టడి చేయాలన్న అంశంపై ప్రధానంగా చర్చించారు. అటవీశాఖ అధికారులు ప్రత్యేక బోనును ఏర్పాటు చేసి సుదూర ప్రాంతానికి తరలించి ప్రాణనష్టం జరుగకముందే చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఇందుకు ఆ శాఖ అధికారులు ఉన్నత స్థాయి అధికారుల అనుమతి తీసుకొని చిరుతను బోనులో బంధించి జూకు తరలించే ఏర్పాటు చేస్తామని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా ప్రజలు అటవీశాఖ అనుమతి లేకుండా నల్లమల అడవిలోకి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శివనాగజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ సత్యశ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణా ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

విత్తనశుద్ధి కేంద్రాల తనిఖీ

● రూ.29.44 లక్షల విలువైన విత్తనాల అమ్మకాలు నిలిపివేత



తనిఖీ చేస్తున్న అధికారులు

నంద్యాల టౌన్, జూలై 10: నంద్యాల మండలంలో పలు విత్తన శుద్ధి కేంద్రాలను వ్యవసాయ శాఖ, విజిలెన్స్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా డీడీఏ సుబ్రమణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో మహాలక్ష్మి ఆగ్రో సీడ్స్, నీలకంఠేశ్వర సీడ్స్ కార్పొరేషన్, లిటిల్ కృష్ణ ప్రాసెసింగ్ ప్లాంట్, బబ్బూరీ ఆగ్రోసీడ్స్, జైదీప్ సీడ్స్ కేంద్రాలను మొదటి బృందం తనిఖీలు చేసింది. వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో బృందం వెంకటేశ్వర సీడ్స్ ప్రాసెసింగ్ ప్లాంట్, నాగ అగ్రిటెక్, ధనలక్ష్మి అగ్రిటెక్, హరిహర ఆగ్రో ఏజెన్సీస్, మంజీరా సీడ్స్ విత్తన శుద్ధి కేంద్రాలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. వీటిలో సరైన ధృవపత్రాలు లేనందున రూ.29.44 లక్షల విలువ చేసే విత్తనాల అమ్మకం నిలుపుదల చేసినట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, కల్తీలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విత్తన శుద్ధి కేంద్రాల యజమానులను అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నంద్యాల ఏడీఏ రాజశేఖర్, విజిలెన్స్ అధికారులు సునీల్‌కుమార్, సిద్ధయ్య, ఏవో ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట తొలగింపు



మొక్క జొన్న పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతు

మిడుతూరు, జూలై 10: సకాలంలో వర్షాలు కురవక ఎండిపోతుండడంతో మొక్కజొన్న పంటను రైతు ట్రాక్టర్‌తో దున్నేశారు. మిడుతూరు గ్రామానికి చెందిన వడ్ల చంద్రుడు అను రైతు తనకున్న మూడు ఎకరాల పొలంలో ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేసి జూన్ నెలలో కురిసిన వర్షాలకు మొక్కజొన్న విత్తనం వేశారు. విత్తనం వేసిన రోజు నుంచి సకాలంలో వర్షం కురవక పంట ఎదగలేదు. పంట ఎదగక దిగుబడి రాదని గ్రహించిన రైతు బుధవారం ట్రాక్టర్‌తో మొక్కజొన్న పంటను దున్నేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వెంకటరమణ నాయక్

అవుకు, జూలై 10: జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారిని ఆలిండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణనాయక్ కోరారు. బుధవారం గిరిజన నాయకులు కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని పలు తండాల్లో కనీస వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీటీ ఎస్ఎస్ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి బాలునాయక్, జిల్లా అధ్యక్షుడు విజయ్ నాయక్, ఉపాధ్యక్షుడు కృష్ణ నాయక్, గౌరవ సలహాదారుడు శంకర్ నాయక్, కార్యదర్శి తిరుపాల్ నాయక్, అరుణ్‌కుమార్ నాయక్, వెంకట రాముడు నాయక్

రుద్రవరం: కలెక్టర్ రాజకుమారిని మండలంలోని కోటకొండ మాజీ సర్పంచ్‌పాములేటి బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వేలంలో పంచాయతీకి పెరిగిన ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల, జూలై 10: కొలిమిగుండ్లలో వారపు సంత మార్కెట్ వేలంలో పంచాయతీకి ఆదాయం పెరిగింది. బుధవారం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటల్లో మొత్తం 25మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఒక్కొక్కరూ రూ.20వేలు డిపా జిట్ చెల్లించి, వేలం పాటల్లో పాల్గొన్నారు. 9నెలల కాలప రిమితికి నిర్వహించిన ఈ వేలంలో బోయ కిరణ్ రూ.4.80లక్షలకు దక్కించుకున్నారు. కాగా గత ఏడాది వేలంలో రూ4.50లక్షల మాత్రమే దక్కగా ఈఏడాది రూ.30 వేలు అదనంగా పంచాయతీకి ఆదాయం లభించినట్లు అధికారులు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా సీఐ గోపినాథ్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, ఈవోఆర్డీ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు, టీడీపీ నాయకులు గూడురు నాగేశ్వరరెడ్డి బ్రదర్స్, దస్తగిరి, గూలి నాగేశ్వరరెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

13న ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం

బేతంచెర్ల, జూలై 10: రాష్ట్రోపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 13న బేతంచెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, ఆజాం బేగ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, రాష్ట్రోపాధ్యాయు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, మాజీ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి హాజరై ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించిస్తారని తెలిపారు. కార్యక్రమంలో చెన్నప్పరెడ్డి, ఎం.పుల్లయ్య, నాగేశ్వర్ నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణ

కోవెలకుంట్ల, జూలై 10: మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 50 మట్టి నమూనాలు సేకరిస్తామని వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూములున్న రైతులు మట్టి నమూనాలు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంపగలరని అన్నారు. అలాగే కౌలు రైతులు యజమాని ఆధార్, పాస్ బుక్ జిరాక్స్‌తోపాటు కౌలు రైతుల ఆధార్, బ్యాంకు అకౌంటు, వివరాలు తీసుకుని వీఆర్వోను సంప్ర దించి కౌలు కార్డులు పొందాలని తెలిపారు.

నేడు కౌలు రైతులకు అవగాహన సదస్సు

కోవెలకుంట్ల, జూలై 10: మండలంలోని రైతుసేవా కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు కౌలు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ట్లు వ్యవ సాయాధికారి నిరంజన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని కౌలు రైతులు, యజమానులు రైతు సేవా కేంద్రంలో గురువారం హాజరై తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

దోమతెరలు వాడాలి

డోన్(రూరల్), జూలై 10: దోమకాటు బారిన పడకుండా ప్రజలు దోమతెరలు వాడాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సాయంత్రం కొత్తబురుజు ఆరోగ్య కేంద్రం పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో స్టాఫ్ డయేరియా, యాంటీ డెంగీలో భాగంగా వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు, హెల్త్ ఆఫీసర్లు ధనలక్ష్మి, వెంకటకుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బనగానపల్లె, జూలై 10: పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈడీ రాజశేఖర్ అన్నారు. బుధవారం బనగానపల్లె మండలంలోని యర్రగుడి గ్రామంలో ఉచిత గర్భకోశా వ్యాధుల పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలు పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకుడు మారుతీ సహకారం, డాక్టర్లు రాఘవేంద్రారెడ్డి, శ్రీకాంతరెడ్డి, రాజశేఖరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మీ, మాజీ సర్పంచ్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో కొలువు దీరిన పీర్లు

అవుకు, జులై 10: మండలంలోని గ్రామాల్లో బుధవారం పీర్లు కొలువుదీరాయి. చావిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 14న చిన్నసరిగెత్తు, 16న మధ్య సరిగెత్తు, 17న పీర్లను ఊరేగింపుగా ప్రధాన వీధుల్లో తీసుకెళ్లి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించటంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయి.

ప్యాపిలి: పట్టణంలోని చావిడీలలో పీర్లను కొలువు దీర్చారు. ఈ వేడుకలు 9రోజులపాటు జరగనున్నాయి. అలాగే మండలంలోని జలదుర్గం, చిన్నపూ దిళ్ల, పీఆర్‌పల్లి, పెద్దపూదిళ్ల, ఏనుగమర్రి, బూరుగుల, రాచెర్ల తదితర గ్రామాల్లో కూడా మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి.

'మొహర్రం వేడుకను ప్రశాంతంగా జరుపుకోండి'

నంద్యాల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు ఈ నెల 17వ తేదిన జరుగనున్న మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ హనుమంతనాయక్, పట్టణ సీఐ రమేష్‌బాబు బుధవారం కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలో వారు మాట్లాడుతూ పండుగలో గొడవలకు, ఘర్షణలకు దిగితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ముందు జాగ్రత్త చర్యగా అనుమానితులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పీర్ల పం డుగ నిర్వహించుకునే గ్రామాల్లో ప్రజలంతా గొడవలకు దూరంగా ఉండాలన్నారు. వివాదాలు సృష్టించి, గొడవలకు పాల్పడితే కఠినచర్యలు చేపడతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బనగానపల్లె, జూలై 10: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్బయ్య కోరారు. బుధవారం కోర్కెల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్‌లను బలోపేతం చేయాలని, కనీస వేతనం రూ.26000 అమలు చేయాలని కోరారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ ఆధ్వర్యంలో కోర్కెల దినోత్సవం సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. సమస్య లను వెంటనే పరిష్కరించాలంటూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రేణుక, త్రివేణి, పద్మావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

సంజామల: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్లు కోరారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం పురస్కరించుకొని అంగన్‌వాడీ వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు డైనమ్మ, సువర్ణ, బీబీ పాల్గొన్నారు.

చాగలమర్రి: అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్కీమ్ వర్కర్ల కోరికల దినం సందర్భంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమణమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

డోన్(రూరల్): పట్టణంలోనీ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకుముందు సీఐటీయూ కార్యాలయం నుంచి పాతబస్టాండు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వచ్చి ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకులు నక్కి శ్రీకాంత్, శివరాం, రామాంజనేయులు, భాస్కర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

కోవెలకుంట్ల: స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుధాకర్, అంగన్‌వాడీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటలక్ష్మి కోరారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆలిండియా కమిటీ పిలుపు మేరకు జూలై 10న కోరికల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు జయప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శివనాగ లక్ష్మి, లక్ష్మీదేవి, బిందు, దేవి, పుల్లమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

బేతంచెర్ల: కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత కోర్కెల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో సీఐటీయూ ఆధర్యంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ ర్యాలీ రామాంజనేయులు అధ్యక్ష తన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, సీఐటీయూ లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు.

రుద్రవరం: కార్మికుల హక్కులకు నష్టం కలిగించే లేబర్ కోడ్ రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. బుధవారం తహసీల్దారు మురళీమోహన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకురాళ్లు మనోజ, పద్మావతి, కృపావతి తదితరులు పాల్గొన్నారు.




బేతంచెర్లలో ర్యాలీగా వెళ్తున్న సేవ్ నాయకులు, ఆశా కార్యకర్తలు, చాగలమర్రిలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


కోవెలకుంట్లలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు


బనగానపల్లెలో..



రుద్రవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

- నేటి నుంచి బియ్యం, కందిపప్పుతో ప్రత్యేక స్టాల్స్
- జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

డోన్, జూలై 10: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మాట్లాడుతూ నంద్యాలలో 2, డోన్‌లో ఒకటి, ఆళ్లగడ్డలో ఒకటి, ఆత్మకూరులో ఒక ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి వినియోగదారులకు సోనమసూరి బియ్యం కిలో రూ.49, కంది పప్పు రూ.160కు ఇస్తామని తెలిపారు. ఒక్కో వినియోగదారుకు బియ్యం 5 కిలోలు, కంది పప్పు కిలో ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జయరాం ఉన్నారు.

తూకాల్లో తేడా వస్తే చర్యలు: జేసీ

ప్యాపిలి: రేషన్ తూకాల్లో తేడా వస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో ఆయన రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సరుకుల్లో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ఆర్డీవో రామేశ్వరరెడ్డి, తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి, డిప్యూటి తహసీల్దారు మారుతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

'పాడి పశువులతో అధిక లాభాలు'

ఉయ్యాలవాడ, జూలై 10: పాడి పశువులతో అధిక లాభాలు పొందవచ్చని ఉమ్మడి జిల్లాల పశు శంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం అల్లూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పశువుల్లో గర్భకోశ వ్యాధుల ఉచిత చికిత్స శిభిరాన్ని పాల ఉత్పత్తి దారులు పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు పెమ్మిరెడ్డి రమణారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆళ్లగడ్డ డివిజన్ డీడీ రమణయ్య, ఏడీ వరప్రసాద్, పశువైద్యాధికారులు రవీంద్రారెడ్డి, సైలజ, నందిని, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి'

ఉయ్యాలవాడ, జూలై 10: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి తెలిపారు. మిషన్ సంకల్ప వంద రోజులు కార్యక్రమంలో భాగంగా ఉయ్యాలవాడలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు.

'చట్టాలపై అవగాహన అవసరం'

దొర్నిపాడు, జూలై 10: మండలంలోని ఆయా గ్రామాల్లోని మహిళలు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. బుధవారం మండలంలోని డబ్ల్యూగోవిందిన్నెలో బాలింతలు, గర్భిణిలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై పలు సూచనలిచ్చారు. ప్రధానమంత్రి మాతృవం దన యోజనపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

'డెంగీతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూలై 10: గ్రామాల్లో ప్రజలు, విద్యార్థులు డెంగీ, సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా సహాయ అధికారి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు సీజన్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. కేజీబీవీ, బీసీ హాస్టల్‌లో దోమల నివారణకు సైపర్‌మైత్రిన్ ద్రావణం పిచికారీ చేయించారు. ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, వైద్యులు అంజలి, ఎస్‌వో సునీత, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, హెచ్ఈ శేఖర్, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

'పరిశుభ్రత పాటించాలి': మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్ఎంలకు వర్చువల్ విధానంలో వివరించారు

వ్యక్తిపై దాడి

నంద్యాల, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని సద్దాం కాలనీలో కేబుల్ తొలగింపుపై మల్లేశ్వరరెడ్డి అనే వ్యక్తిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం దాడి చేశారు. బాధితుడు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. దీనిపై పట్టణ సీఐ రమేష్‌బాబు మాట్లాడుతూ బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని చెప్పారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

బనగానపల్లె, జూలై 10: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ అనే నాటుసారా విక్రేతను అరెస్ట్‌చేసి, 30లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జోగేంద్ర బుధవారం వెల్లడించారు. తమ సిబ్బందితో కలిసి కొత్తపేట, పలుకూరు, చిన్నరాజుపాలెం గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించగా అశోక్‌కుమార్ పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పోతులయ్య తెలిపారు.

రుణ యాప్‌లతో మానసిక వేదనకు గురవుతున్నారు..

డోన్(రూరల్), జూలై 10: ఆంధ్రప్రదేశ్‌లో అనేక కుటుంబాలు రుణ యాప్‌ల బారిన పడి వారు మానసిక ఒత్తిళ్లకు, మానసికంగా నలిగిపోతున్నారని ఏపీ బీసీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు అన్నారు. బుధవారం డోన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఈ నాగరాజు మాట్లాడుతూ దేశంలో 1600 పైగా రుణ యాప్‌లను రద్దు చేసిన ఫలితం లేకుండా పోతుందన్నారు. ప్రైవేటు రుణ యాప్‌ల పేరుతో చేస్తున్న ఒత్తిడికి ఆయా కుటుంబాలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'పంచాయతీల అభివృద్ధిలో ప్రజలే కీలకం'

రుద్రవరం, జూలై 10: పంచాయతీల అబివృద్ధిలో ప్రజలే కీలకమని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం మండలంలోని యల్లావత్తుల, శ్రీరంగాపురం సచివాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం': పౌష్టికాహారంతో గర్భిణుల ఆరోగ్యం పదిలమని వైద్యాధికారి శివమోహన్ తెలిపారు. బుధవారం పీఎంఎస్ఎంఏ పథకం కింద గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేశామన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నంద్యాల, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పడకండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రధానమంత్రి మాతృవందన యోజనపై, ఆరోగ్యంపై బుధవారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సంకల్పం-100 రోజులలో బాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు కాన్పునకు ముందు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, విశ్రాంతి వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

దొర్నిపాడు, జూలై 10: సీజన్ వ్యాధులతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ సూచించారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడులో వాటర్, ఫిల్టర్ ట్యాంకును పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉజ్వా, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఉన్నారు.

'సాంకేతికతను వినియోగించి బోధించాలి'

శిరివెళ్ల, జూలై 10: అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను వినియోగించి ఉపాధ్యాయులు విద్యాబోధన సాగించాలని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకుడు పెంచలయ్య సూచించారు. మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల, మెయిన్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం అందించిన విద్యార్థి కిట్లను ఆయన బుధవారం పరిశీలించారు. పాఠశాలలకు చేరిన కిట్స్ పంపిణీ, విద్యార్థులు వినియోగిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. విద్యా వ్యవస్థలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) ప్రాముఖ్యతను వివరించి విద్యాబోధనను పరిశీలించారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ లలిత కుమారి, అసిస్టెంట్ ఏఎంవో యూనస్ బాషా, ఎంఈవోలు శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి, హెచ్ఎంలు విజయ్ కుమార్, వెంకటరమణ, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అవకతవకలకు పాల్పడొద్దు'

నంద్యాల, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సరఫరా చేసే కిట్స్ పంపిణీలో అవకతవకలకు పాల్పడరాదని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకుడు పెంచలయ్య అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కిట్స్ విద్యార్థులకు అందితే వారు ప్రభుత్వం పట్ల విధేయత కల్గుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ పరిశీలకురాలు లలిత, యూనుస్, ఎంఈవో శోభావివేకవతి, హెచ్ఎం సంధ్యారాణి ఉన్నారు.


యర్రగుంట్లలో స్కూల్ బ్యాగులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు పెంచలయ్య

ఉయ్యాలవాడను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే


ఎమ్మెల్యే అఖిలప్రియ దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఉయ్యాలవాడ, జూలై 10: ఉయ్యాలవాడ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా మండల కేంద్రానికి రావడంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దంపతులకు మండల నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ పూలమాల వేసి బాణసంచా పేల్చి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ఆగస్టు నెల నుంచి రేషన్‌తో పాటు రూ.160కే కిలో కందిపప్పు ఇస్తామ న్నారు. ఉయ్యాలవాడలో బస్‌స్టాండ్, సచివాలయ నిర్మాణం చేపడతామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. మాయలూరులో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కూడాల నారాయణరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, అనంత రామసుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, గోపిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, సుధాకర్‌రెడ్డి, పల్లె బాబుల్‌రెడ్డి, చిట్టిపు రాజగోపాల్‌రెడ్డి, కర్నాటి మహేశ్వరరెడ్డి, మద్దూరు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, నరేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పీఠాధిపతి జన్మదిన వేడుకలు

నంద్యాల, జూలై 10(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ 69వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. 108 వైష్ణవ దివ్య క్షేత్రాల నుంచి స్వామి వారి మహాప్రసాదం పీఠాధిపతికి అందించారు. ప్రముఖ క్షేత్రాలైన శ్రీరంగం, కంచి, తిరుమల-తిరుపతి, షోలింగర్, తిరువల్లూరు క్షేత్రాల నుంచి వచ్చిన అర్చకులు పీఠాధిపతిని సత్కరించారు. అలాగే అహోబిలం మఠం హైదరాబాదు, అహోబిలం మఠం గద్వాల్, అహోబిలం మఠం భద్రాచలం, అహోబిలం మఠం అహోబిలం దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు గజమాలతో సత్కరించారు. పీఠాధిపతి జన్మదినాన్ని పురస్కరించుకొని 690 మంది భక్తులకు అన్నదానం చేశారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలన్, సౌమ్యానారాయణ్, ఏడీఏ రవికాంత్‌చౌదరి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'రహదారి నియమాలు పాటించాలి'


శిరివెళ్ల, జూలై 10: వాహనదారులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలని నంద్యాల మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవి శంకర్ సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, కృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలి


ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

డోన్(రూరల్), జూలై 10: డోన్ ఐసీడీఎస్ కార్యాలయంలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సీపీఎం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, శివరాంలు కోరారు. బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. డోన్ ఐసీడీఎస్ పరిధిలో ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాలకు సంబంధించి 15 మంది సూపర్‌వైజర్లు 298 మంది అంగన్‌వాడీ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. ఐసీడీఎస్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే మహిళలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాగే తాగునీరు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి


తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న పర్యావరణ ప్రేమికులు

ప్యాపిలి, జూలై 10: మానవాళి ఆరోగ్యానికి హాని కలిగించే కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని పట్టణానికి చెందిన పర్యావరణ ప్రేమికులు బుధవారం తహసీల్దారు ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో ఈ మొక్కలను విరివిగా పెంచుతున్నారన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రేమికులు కిషోర్, చైతన్య మాట్లాడుతూ ఈ మొక్కలు చూడటానికి అందంగా ఉన్నా.. ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తాయ న్నారు. కార్యక్రమంలో వెంకటేశ్, మౌలాలి, నరేంద్ర, చంద్ర, సునీల్ పాల్గొన్నారు.